క్లుప్తంగా

రైలు ఢీకొని కూలీ మృతి

కమలాపూర్ : పట్టాలు దాటుతున్న కూలీని ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. దీంతో అతడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉప్పల్‌లో శనివారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ ఎస్సై పరశురాములు కథనం ప్రకారం.. పరకాలకు చెందిన గడ్డం రవి (54) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడు శనివారం ఉప్పల్‌కు వచ్చి హుజూరాబాద్–పరకాల ప్రధాన మార్గంలోని రైల్వే గేట్ వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మృతుని భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు పితృవియోగం

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ బగ్గి రమేష్‌కు పితృ వియోగం కలిగింది. రమేష్ తండ్రి సాంబయ్య (70) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. సాంబయ్య మృతదేహానికి మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, శాయంపేట సర్పంచ్ కందగట్ల రవి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు తోట శ్రీనివాస్, ఎలమంచ జయపాల్‌రెడ్డి, చాడ మహేందర్‌రెడ్డి, సీఈఓ రాజమోహన్, నాయకులు తోట కుమారస్వామి, తోకల సమ్మిరెడ్డి, బేరుగు రాకేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సన్మానం



శాయంపేట : పరకాల రూరల్ సీఐ మల్లేష్, శాయంపేట ఎస్సై దేవేందర్‌లను ఆర్‌ఎంపీ సంఘం నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పరిధికి మించి వైద్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కర్రు సంపత్, మండల అధ్యక్షుడు కానుగుల నాగరాజు, ఉపాధ్యక్షుడు కందగట్ల అనిల్, ప్రధాన కార్యదర్శి అబ్బు జయపాల్ రెడ్డి, రంగు శ్రీధర్, రవి పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : మండలంలోని మాందారిపేటకు చెందిన అల్లం రాజకొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ సభ్యులు గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

సంగెం : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అశోక్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సాధారణంగా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు కారణమయ్యే దోమలు వృద్ధి చెందకుండా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ డబ్బాలు, కొబ్బరి చిప్పలు తొలగించుకోవాలన్నారు. కండ్ల కలక అంటువ్యాధి అని వచ్చిన వారు జాగ్రత్తలు తీసుకుని బయట తిరగకుండా ఉండాలన్నారు. తాగునీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సరితకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని గణిత విభాగం పరిశోధకురాలు గౌరవేణి సరితకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'మార్కోవ్ ప్రాసెస్ ఇన్ రెలియబిలిటీ మోడల్స్–ఫర్ఫార్మెన్స్–ఎ స్టడీ' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సరితకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలాదేవి పర్యవేక్షణలో సరిత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పాన్ షాపులో చోరీ

హసన్‌పర్తి : కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగట్టు క్రాస్ వద్ద పాన్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన ఖాజా శనివారం ఉదయం పాన్‌షాపు తెరవడానికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. సుమారు రూ.80వేలు విలువైన సామాను చోరీకి గురైనట్లు పోలీసులకు ఖాజా ఫిర్యాదు చేశాడు.

తల్లిపాలు శిశువుకు శ్రేష్టం



దామెర : అన్నప్రాసన చేయిస్తున్న సూపర్‌వైజర్ రాణి

దామెర : తల్లిపాలు శిశువుకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పులుకుర్తిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిశువు ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయని తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని చెప్పారు. ఆర్నెళ్లపాటు శిశువుకు తల్లిపాలు కీలకమని వివరించారు. తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెంచి ఆరోగ్యంగా ఎదగడానికి దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, ఉదయ, జయ, రేణుక, సంధ్య పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తి పెంపు

నడకూడ : తల్లి పాలతో శిశువు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఎంపీపీ మచ్చ అనసూర్య తెలిపారు. మండలంలోని కొకొండ గ్రామ పంచాయతీ ఆవరణలో, నార్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లి పాల ప్రాశస్త్యాన్ని బాలింతలు, గర్భిణీలు, తల్లులు గుర్తించాలని సూచించారు. పుట్టిన శిశువుకు వెంటనే ముర్రుపాలు పట్టిస్తే తల్లికి, శిశువుకు మేలు జరగుతుందని చెప్పారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. తల్లి పాలు పట్టించడంతో తల్లికి అధిక రక్తపోటు, దీర్ఘకాలిక జబ్బుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



నడికూడ : అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ

'సఖి' సేవలతో మహిళలకు సాంత్వన



అవగాహన కల్పిస్తున్న వినీల, కరుణ

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలతో మహిళలకు సాంత్వన లభిస్తుందని కేస్ వర్కర్ వినీల, పారామెడికల్ ఉద్యోగి కరుణ తెలిపారు. మండలంలోని కొండపర్తి పీహెచ్‌సీలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్ల కోసం శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో వినీల, కరుణ మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు చట్టాలను వినియోగించుకునేలా వివరించారు. సఖి సెంటర్‌లో విడిపోయే భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి, తదితరాల సంబంధించి పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తోందని తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు కౌన్సిలింగ్ చేయడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందించనున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు సఖి సేవలను వివరించాలని వైద్య ఉద్యోగులను, సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుభాష్, డాక్టర్లు రమ, రమ్య, సీఈఓ సాంబయ్య, రవీందర్, సఖి సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



పరకాల : పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆ సంస్థ కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించి జీఓ విడుదల చేయగా గవర్నర్ అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. గవర్నర్ మానవతా దృక్పథంతో ఆలోచించి విలీనానికి సంబంధించిన జీఓను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు శ్రీనివాస్, బాపురావు, రవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

దామెర : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల మహాసభకు భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడచినా పేదలకు విద్య, వైద్యం, కూడు, నీడ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు రాయితీల పేరుతో ప్రజాధనాన్ని దోచిపెడుతోందని మండిపడ్డారు. విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేయడంతోపాటు క్రిమి సంహారక మందుల ధరలు విపరీతంగా పెంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని చెప్పారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అంబి సాంబయ్య, సహాయ కార్యదర్శులుగా ఎడ్ల మంజుల, దండు భాస్కర్, కోశాధికారిగా గొలుసుల దేవేందర్ ఎన్నికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన తిప్పారపు రవి నీరుకుళ్ల శివారులోని చలివాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆత్మకూరు శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని ఆయన చెప్పారు.

కళ్ల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



శాయంపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ కళ్లను పరిరక్షించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ కందగట్ల రవి కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని సర్పంచ్ రవి పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఏవైనా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే వైద్యులకు చూపించుకోవాలని సూచించారు. అప్తాల్మాలజిస్టులు అనూష, శ్రీజ కంటి పరీక్షలు నిర్వహించారు. 10 మందికి శస్త్ర చికిత్స అవసరమైన నిర్ధారించి వారిని ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, కోఆర్డినేటర్ వంశీ, కమ్యూనిటీ ఐ హెల్త్ వర్కర్ రూపాదేవి పాల్గొన్నారు.

ఆచార్య జయశంకర్ చిరస్మరణీయుడు



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు

పరకాల : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిరస్మరణీయుడని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ కళాశాలలో ఆచార్య జయశంకర్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేశాడని కొనియాడారు. జయశంకర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, డాక్టర్ పి.సుభాషిణి, డాక్టర్ వి.రాజయ్య, డాక్టర్ జి.స్వప్న, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.ఓదేలు, డాక్టర్ ఎం.అరుణ, కుమారస్వామి, అశోక్ మోరె, రవికుమార్, అనిల్‌కుమార్, సుసిత్మ, డి.సంజయ్, రాజు, రఫీ, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



సంగెం : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రాజ్‌కుమార్ శనివారం సంగెం, కుంటపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర మౌలిక సదుపాయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సత్యదేవ్, ప్రవీణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

దామెర : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన అందుతుందని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, 'మన ఊరు–మన బడి' పనులను, ఇన్నొవేటివ్ ప్లాంటేషన్ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ పాటించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 'మన ఊరు–మన బడి' పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్నోవేటివ్ ప్లాంటేషన్ కోసం తగిన స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ రవీందర్, ఏపీఓ శారద, ఉపాధ్యాయులు సత్తార్, అజిత్, రాధిక తదితరులున్నారు.

పశుసంపదను రక్షించుకోవాలి

● ఇన్‌చార్జ్ ఏడీ నాగమణి

సంగెం : పాడిరైతులు, పశుపోషకులు పశువులను వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవాలని ఎనిమల్ డయాగ్నస్టిక్ ల్యాబోరేటరీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ నాగమణి కోరారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పశువులకు ముద్ద చర్మం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులు రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. పశువులను రోజు గమనించాలని సూచించారు. అనారోగ్యానికి గురైనట్లు గుర్తించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించి వాటికి సకాలంలో చికిత్స చేయించాలని సూచించారు. టీకాల పనితీరును పరీక్షించడానికి టీకాలు వేసిన పశువుల రక్తం నమునాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల ప్రభాకర్, పశువైద్యాధికారి వల్లె రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగడి అభివృద్ధికి నిధులు కేటాయించాలి



కొమ్మాల అంగడిలో మాట్లాడుతున్న మధుకర్

గీసుకొండ : మండలంలోని కొమ్మాల అంగడి అభివృద్ధికి నిధులు కేటాయించి, కనీస సౌకర్యాలు కల్పించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ డిమాండ్ చేశారు. శనివారం కొమ్మాల అంగడిని సంఘం నాయకులతో కలిసి పరిశీలించి ఆయన మాట్లాడారు. అంగడిలో తాగునీరు, విశ్రాంతి కోసం రేకుల షెడ్లు, నీటి తొట్లు, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, కమిటీ సభ్యులు కోడి శ్రీను, గాదం కుమారస్వామి, చల్లా కొమురయ్య, లింగయ్య, పులిగిల్ల సుధాకర్, కుక్కల రాజు, వడ్డే రవి, పేర్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సోషలిజమే ప్రత్యామ్నాయం



సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

ఐనవోలు : పెట్టుబడిదారీ విధానానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సారంపల్లి వాసుదేవరెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా సర్పంచ్ బండి పర్వతాలు వ్యవహరించగా వాసుదేవరెడ్డి అతిథిగా హాజరై కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను బోధించి మాట్లాడారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య అల్లర్లు సృష్టించి అక్కడి ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి కేంద్రం కుట్ర పన్నిందని విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలు అవలంభిస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చాక పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్యులను నట్టేట ముంచుతున్నారని ధ్వజమెత్తారు. మతోన్మాద పాలన సాగుతోందని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. తొలుత పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కొంకాల నారాయణరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, కమిటీ సభ్యులు సంపత్, నారాయణరెడ్డి, నాగరాజు, ఉప్పలయ్య, కవిత, యాకయ్య, శరణ్య, నర్సయ్య, మాణిక్యం, నరేష్, సలీం, పోచమ్మ, సృజన, ఫాతిమా, ఎల్లమ్మ, ఆనందం, మౌనిక, కుమారస్వామి, కొమురయ్య, హరీష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే బంగారంపై రుణం

● యూబీఐ మేనేజర్ రాజశేఖర్



గోల్డ్ లోన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేనేజర్ రాజశేఖర్, తదితరులు

కమలాపూర్ : యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకే గోల్డ్ లోన్ అందిస్తున్నట్లు శనిగరం బ్రాంచ్ మేనేజర్ కస్తూరి రాజశేఖర్ తెలిపారు. మండలంలోని శనిగరం గ్రామంలో గోల్డ్ లోన్ స్కీమ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. కేవలం 72 పైసల వడ్డీకే రైతులు, బ్యాంకు ఖాతాదారులకు బంగారంపై రుణాలిస్తున్నట్టు తెలిపారు. రైతులకు పంటల పెట్టుబడి, ఇతరత్రా అవసరాల కోసం రుణాలివ్వనున్నట్లు చెప్పారు. ఖాతాదారుల కోసం నాన్ అగ్రికల్చర్ గోల్డ్ లోన్ సదుపాయం కల్పించినట్లు వివరించారు. బ్యాంకు శాఖ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆటోలకు గోల్డ్ లోన్ స్కీమ్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అరుకాల సురేష్, బ్యాంకు మిత్ర కత్తి రమేష్, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు మిరుపురి కుమారస్వామి, గడ్డం స్వామి, అధ్యక్షుడు వక్కల కుమార్ దాస్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, కోశాధికారి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి



పంటలను పరిశీలిస్తున్న మహేందర్, నాయకులు

ఐనవోలు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రకృతి విపత్తు కింద పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంథిని గ్రామంలో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలోని బృందం శనివారం పర్యటించి పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా మహేందర్ మీడియాతో మాట్లాడారు. నర్సింహులకుంట చెరువు మత్తడికి గండి పడడంతో సుమారు వంద ఎకరాలకుపైగా పంట నష్టం వాటిల్లిందని ఆందోళన వెలిబుచ్చారు. వరదలతో ఇసుక మేటలు వేసి నాటు వేసిన వరి పొలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. భారీ వర్షాలకు మండలంలోని 17 గ్రామాల్లో భారీగా పంట నష్టం జరిగిందని వివరించారు. పంట నష్టం అంచనా వివరాలు సేకరించడానికి ఇప్పటివరకు వ్యవసాయ, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదన్నారు. ఇకనైనా అధికారులు గ్రామాల్లో వెంటనే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు మడూరి మల్లేశం, బండి మహేందర్, బరిగెల స్వామి, మడూరి చిన్నరాజు, ముస్కు సంజీవ, బండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన అలుగోజు రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అతడి నివాసంలో సర్పంచ్ ప్రమీల ప్రతాప్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భవానీ దేవేందర్‌రావు, మాజీ సర్పంచ్ చదిరం వీరస్వామి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గునిగంటి రమేష్, నాయకులు కడారి పవన్‌కుమార్, కొంగ ప్రవీణ్, నాయినేని వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో పద్మశాలీలకు ప్రాధాన్యమే ధ్యేయం



ఆత్మకూరు : రాజకీయాల్లో పద్మశాలి కులస్తులకు ప్రాధాన్యత సాధించడమే ధ్యేయంగా ఈనెల13న కోరుట్లలో పద్మశాలి ఆత్మ గౌరవ యుద్ధభేరి సభ నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో 'ఛలో కోరుట్ల' కార్యక్రమ పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పద్మశాలి కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అన్ని రాజకీయ పార్టీలూ పద్మశాలి కులస్తులకు సముచిత అవకాశాలు కల్పించేలా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కులస్తులందరూ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పాపని రవీందర్, ఇర్సడ్ల సదానందం, కందకట్ల రాము, వడ్డెపెల్లి వేణు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

గీసుకొండ : గీసుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం హనుమకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 900 నోట్ బుక్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్ఎం జ్యోత్స్నప్రభ, క్లబ్ జిల్లా కమ్యూనికేటర్ కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ కల్వెర్ల అనసూయ, భర్త : ఎల్ల స్వామి వయస్సు 57 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం ఇ.నం 5-11-941, పోచమ్మకుంట, హన్మకొండ మండలం & హన్మకొండ జిల్లా వారు షెడ్యూల్ ఆస్తి నం.1 మరియు 2 క్రింద పేర్కొన్న వ్యవసాయ భూములకు సంపూర్ణ యజమాని మరియు అనుభవించువారు అని సాధారణ ప్రజలకు తెలియజేస్తున్నాము.

షెడ్యూల్ ఆస్తి నం.1 : 1. హన్మకొండ జిల్లాలోని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో హన్మకొండ మండలం మరియు హన్మకొండ జిల్లాలో వర్ల ఎకరాలు 0.36 గుంటల విస్తీర్ణం ఉన్న సర్వే నం 385 లోని వ్యవసాయ భూమి. సరిహద్దులు : తూర్పు: వాగు, పశ్చిమం: రోడ్, ఉత్తరం: శ్రీధర్ వ్యవసాయ భూమి, దక్షిణం: ఇతరుల వ్యవసాయ భూమి.

షెడ్యూల్ ఆస్తి నం.2 : హన్మకొండ జిల్లాలోని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో హన్మకొండ మండలం మరియు హన్మకొండ జిల్లా వర్ల ఎకరాలు 0.24 గుంటల విస్తీర్ణం సర్వే నం.397/బి లోని వ్యవసాయ భూమి, సరిహద్దులు ఉన్నాయి: తూర్పు: మేరియమ్మ భూమి, పశ్చిమం: కల్వెర్ల అనసూయ భూమి, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: నరేష్ భూమి.

నా క్లయింట్ తన కొడుకు కల్వెర్ల లక్ష్మణ మూర్తి, తండ్రి కల్వెర్ల ఎల్ల స్వామి పైన పేర్కొన్న ఐటమ్ 1&2 ఆస్తులకు సంబంధించి హన్మకొండలోని తహసీల్దార్ & జాయింట్ సబ్-రిజిస్ట్రార్ వద్ద తేదీ 25.07.2023 నాటి నోటిఫైడ్ [illegible] దస్తావేజు నం.90ను సృష్టించి, వాటిని అక్రమంగా [illegible] ప్రయత్నిస్తున్నారు. అందువల్ల నా క్లయింట్‌కు సమాచారం ఇవ్వకుండా నా క్లయింట్ యొక్క కుమారుడు కల్వెర్ల లక్ష్మణ మూర్తి, తండ్రి కల్వెర్ల ఎల్లస్వామి నుండి పైన పేర్కొన్న 1&2 ఆస్తులకు సంబంధించి ఎలాంటి లావాదేవీని కొనుగోలు చేయరాదని/ [illegible] సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఈ ప్రకటన తరువాత పైన పేర్కొన్న ఐటమ్ 1&2 ఆస్తులకు సంబంధించి ఎవరైనా ఏదైనా లావాదేవీని కొనుగోలు చేసినట్లయితే/సమోదు చేసినట్లయితే, అది అతడు/ఆమె/వారి స్వంత పూచీపై ఉంటుంది మరియు దాని యొక్క అన్ని ఖర్చులు మరియు పర్యవసానాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

తేది:05.08.2023

Sd/- ఎండీ యూసుఫ్ అలీ, ఎండీ ఫరూక్ అలీ అడ్వకేట్స్
ఇ.నం.9-2-48/1,దార్‌బౌలి, వరంగల్.
సెల్: 9849226367, 9949226367